సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 15 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32 వేలు పలికాయి.



ఉల్లాసంగా.. ఉత్సాహంగా

'సాక్షి' ఆధ్వర్యంలో గురువారం బాలల దినోత్సవం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. దివ్యాంగ చిన్నారులు సంతోషంగా క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
31.8°/19.5°

జిల్లా పరిధిలో గురువారం తుపాను వాతావరణం నెలకొంది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై చాలా ప్రాంతాల్లో మోస్తరుగా వర్షం కురిసింది.

తమ్ముళ్ల భూదందా

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి తమ్ముళ్ల అవినీతి, అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఇసుక మొదలు కబ్జాల దాకా అన్నింటిలోనూ దందా సాగిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఆఖరికి గత ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన స్థలాలపై కూడా టీడీపీ గద్దలు వాలిపోతున్నాయి.

- కొత్తచెరువులో 22 పేదల ప్లాట్లకు ఎసరు
- అధికారం అడ్డుపెట్టుకొని ఇళ్ల నిర్మాణాలకు మోకాలడ్డు
- స్థలాల రేట్లు పెరగడంతో కాజేసేందుకు కుట్ర
- కలెక్టర్‌తో పాటు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా లబ్ధిదారులకు జరగని న్యాయం



టీడీపీ నేతలు ఆక్రమిస్తున్న 22 ప్లాట్లు ఇవే

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అక్రమార్జనే ధ్యేయంగా టీడీపీ కార్యకర్తలు అడ్డదారులు తొక్కుతున్నారు. ముఖ్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలపై కన్నేశారు. కొత్తచెరువు నుంచి ధర్మవరం వెళ్లే దారిలో సర్వే నంబరు 384లో జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. అక్కడ అప్పటికే కొందరు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఈ ఏడాది ఆరంభంలో అదనంగా మరో 22 మందికి ఒకటిన్నర సెంటు చొప్పున ప్రభుత్వం స్థలాలను పంపిణీ చేసింది. అందరూ పేదలు కావడంతో వెంటనే ఇళ్ల నిర్మాణం చేపట్టలేకపోయారు. అంతలోనే ఎన్నికల కోడ్ వచ్చింది. ఆ తర్వాత ప్రభుత్వం మారింది. దీంతో ఆ ప్లాట్లపై టీడీపీ నేతల కన్ను పడింది.

స్థలాలకు విలువ పెరగడంతో...

ధర్మవరం వెళ్లే దారిలోని స్థలాలకు భారీ విలువ పలుకుతుండటంతో 22 ప్లాట్లను తమ్ముళ్లు కబ్జా యత్నం చేస్తున్నారు. 'విచారణ చేసేవరకు ఆయా స్థలాల్లో ఎవరూ పనులు చేయరాదు.. ఇట్లు తహసీల్దార్' అనే బోర్డు రెండు నెలల క్రితం ఏర్పాటు చేశారు. అయితే దీనిపై అప్పటి తహసీల్దార్ ప్రతికూలంగా స్పందించారు. ఆ బోర్డుకు తనకు ఎలాంటి సంబంధమూ లేదని.. ఎవరు పాతారో తెలీదని స్పష్టం చేశారు. అయితే ఆ స్థలాల్లో పనులు ఆపాలని.. అందులో అక్రమాలు చోటు చేసుకున్నట్లు తమకు ఫిర్యాదు అందిందని వివరించారు. త్వరలోనే విచారణ చేపడతామని.. పూర్తయ్యే వరకు ఎవరూ ఆ ప్లాట్లలో పనులు చేయరాదని ఆయన అప్పట్లో మౌఖిక ఆదేశాలిచ్చారు. ఆ తర్వాత ఆయన బదిలీ అయ్యారు. కొత్త అధికారి వచ్చారు. ఇప్పటి వరకూ విచారణ పూర్తయిందో? లేదో? తెలీదు.. కానీ ఎవరూ వెళ్లకూడదని గతంలో చెప్పారు. కానీ ప్రస్తుతం టీడీపీ నేతలు జేసీబీ యంత్రాలతో పనులు మొదలుపెట్టారు. దీంతో దిక్కు తోచని స్థితిలో లబ్ధిదారులు ఉన్నారు. టీడీపీ నేతలు అక్రమంగా ఈ ప్లాట్లను ఇతరులకు విక్రయించి జేబులు నింపుకొనేందుకు స్కెచ్ వేశారని వాపోతున్నారు.

వారి కనుసన్నల్లోనే...

కొత్తచెరువులో టీడీపీకి పెద్ద దిక్కుగా ఉన్న సాలక్కసారి శ్రీనివాసులు సారథ్యంలోనే భూకబ్జాలు సాగుతున్నట్లు బాధితులు చెబుతున్నారు. ఆయనతో పాటు మరో ఇద్దరు కీలక నేతలు అధికారాన్ని.. అధికారులను అడ్డు పెట్టుకుని పేదలపై పెత్తనం చెలాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే ఇచ్చిన స్థలాలకే రక్షణ లేకపోతే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు.



ఇంటి నిర్మాణాలు ఆపడంతో నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు (ఫైల్)

అర్హత ఉన్న వారికే అందజేస్తాం

కొత్తచెరువులో నిర్మించిన జగనన్న లేఅవుట్ లో ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. మాకు తెలియకుండా బోర్డులు గతంలో ఏర్పాటు చేసినా.. మా దృష్టికి వచ్చిన వెంటనే తొలగించాం. అనర్హులకు ఇంటి పట్టాలు ఇచ్చినట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో నిర్మాణాలు ఆపాలని సూచించాం. విచారణ తర్వాత అర్హులకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు.

– నీలకంఠారెడ్డి, కొత్తచెరువు తహసీల్దార్

టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారు



గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న లేఅవుట్‌లో పట్టాలు మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొంతమంది టీడీపీ నాయకులు కాజేసేయత్నం చేస్తున్నారు. గతంలో ఆర్థిక స్తోమత లేక ఇళ్లు నిర్మించలేకపోయాం. ఆస్తి విలువ ఎక్కువగా ఉండటంతో నిర్మాణాలను అడ్డుకుని ఆక్రమించుకోవాలని చూస్తున్నారు. భూమి వివాదంలో ఉందని అధికారుల నుంచి నోటీసులు ఇప్పించారు. అధికారులకు తెలీకుండా.. బోర్డులు పెట్టడం విడ్డూరం.

– యుగంధర్, లబ్ధిదారుడు

కలెక్టర్‌ను కలిసినా న్యాయం జరగలేదు



టీడీపీ నేతలు కొత్తచెరువు లేఅవుట్‌లో పాట్ల నిర్మాణాలు అడ్డుకున్నారు. మా సమస్యపై కలెక్టరేట్‌ను కూడా ఆశ్రయించాం. కానీ ఇంతవరకు న్యాయం జరగలేదు. పోలీసు అధికారులకు వినతిపత్రం ఇచ్చినా.. సివిల్ పంచాయతీల్లో తాము జోక్యం చేసుకోబోమని సమాధానం ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే.. అనర్హులుగా ఫిర్యాదులు ఇచ్చారని.. విచారణ చేయించి అర్హత ఆధారంగా ఇస్తామని చెబుతున్నారు. త్వరగా విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతున్నాం.

– ప్రభావతమ్మ, లబ్ధిదారురాలు

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులనే..



ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచామనే అక్కసుతో మా ఇంటి నిర్మాణాలను అడ్డుకుంటున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని పేదల ఇంటి నిర్మాణాలపై దౌర్జన్యం చేయడం దారుణం. గత ప్రభుత్వ హయాంలో కుల, మత, వర్గ, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి అక్కరికీ పట్టాలు అందించారు. టీడీపీ కండువా వేసుకోలేదని మా ఇంటి నిర్మాణాలు అడ్డుకోవడం సరికాదు. అధికారులు, పాలకులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నాం.

– కురుబ గంగమ్మ, లబ్ధిదారురాలు

న్యూస్‌రీల్

సత్యసాయి జయంతి వేడుకలకు రండి

- గవర్నర్‌ను ఆహ్వానించిన రత్నాకర్‌రాజు



గవర్నర్‌ను ఆహ్వానిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్‌రాజు

ప్రశాంతి నిలయం: సత్యసాయి 99వ జయంతి వేడుకలలో పాల్గొనాలని గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు ఆహ్వానించారు. గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నవంబర్ 23న ప్రశాంతి నిలయంలో సత్యసాయి 99వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. దేశ, విదేశాలకు చెందిన వేలాది భక్తులు వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. వేడుకలకు హాజరై భక్తులకు సందేశాన్ని ఇవ్వాలని కోరారు. అందుకు గవర్నర్ సుముఖత వ్యక్తం చేశారని రత్నాకర్‌రాజు తెలిపారు.

సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా టాస్క్‌ఫోర్స్

- సభ్యులుగా కేతిరెడ్డి, రమేష్‌గౌడ్




కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, రమేష్‌గౌడ్

అనంతపురం కార్పొరేషన్: అక్రమ నిర్బంధాలు, అరెస్టులతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉండేలా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో టాస్క్‌ఫోర్స్ సభ్యులుగా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్‌ను నియమిస్తూ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. సోషల్ మీడియా కార్యకర్తలకు న్యాయ సహాయం కల్పించడంతో పాటు బాధితులను పరామర్శిస్తూ ఆత్మస్థైర్యం నింపాలని సభ్యులకు వైఎస్ జగన్ సూచించారు. పార్టీ నాయకులు, లీగల్ సెల్ ప్రతినిధులను సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

జిల్లాకు వర్షసూచన



బుక్కరాయసముద్రం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో రానున్న 3 రోజుల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పగటి ఉష్ణోగ్రతలు 29.4–32.0, రాత్రి ఉష్ణోగ్రతలు 20.0–24.6 డిగ్రీల సెల్సియస్ నమోదు కావొచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 80–94 , మధ్యాహ్నం 63–80 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

ఎస్కేయూలో 'ఎన్ఐఆర్ఎఫ్' బృందం



ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ అనితతో మాట్లాడుతున్న ఎన్ఐఆర్ఎఫ్ కమిటీ సభ్యులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాన్ని గురువారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) కమిటీ సందర్శించింది. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ బి. అనితతో కమిటీ సభ్యులు ప్రొఫెసర్ బి. రాజశేఖర్ (యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్), ప్రొఫెసర్ పీయూష్‌కాంతి పాణిగ్రాహి (కోల్‌కతా వర్సిటీ), ప్రొఫెసర్ సంజయ్ ఢోలే సావిత్రిభాయి పూలే యూనివర్సిటీ, పూణే) సమావేశమై పలు విషయాలపై చర్చించారు. కాగా, ఐదు అంశాల ఆధారంగా వర్సిటీ పురోగతిని కమిటీ సభ్యులు అంచనా వేస్తారు. బోధన, అభ్యసన (30 శాతం), పరిశోధన (30 శాతం), ఔట్‌రీచ్ (10 శాతం), గ్రాడ్యుయేషన్ ఫలితాలు (20 శాతం), అవగాహన (10 శాతం) అంశాల ఆధారంగా ర్యాంకు కేటాయిస్తారు.

నెహ్రూ సేవలు మరువలేనివి



నెహ్రూ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: దివంగత ప్రధాని, పండింట్ జవహర్‌లాల్ నెహ్రూ మన దేశం కోసం చేసిన సేవలు మరువలేనివి. ప్రతి ఒక్కరూ ఆయన సేవలను గుర్తుంచుకోవాలి' అని ఎస్పీ రత్న సూచించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పోలీస్ కార్యాలయంలో పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ రత్న హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ మన దేశ మొదటి ప్రధానిగా నెహ్రూ పనిచేశారన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో తన వంతు పాత్ర పోషించారన్నారు. నెహ్రూకు చిన్నారులన్నా, గులాబీలు అన్నా అమితమైన ఇష్టమని తెలిపారు. అందుకే ఆయన పుట్టిన రోజును బాలల దినోత్సవంగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. బాలల చట్టపరమైన హక్కులు, అభివృద్ధి, విద్య, గౌరవం ఇవ్వడంతో పాటు వారి కలలు సాకారం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఏఓ సుజాత, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్ఐ వలి, సూపరింటెండెంట్ సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

18న జాబ్‌మేళా

హిందూపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, హిందూపురంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉదయం 9 గంటలకు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ హరీష్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి బి.హరికృష్ణ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసి, 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసున్న నిరుద్యోగులు అర్హులు. ఎంపికైన వారు అనంతపురం, హిందూపురం, బెంగళూరులో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుంది. నెలకు రూ.14 వేల నుంచి రూ.25వేల వరకూ వేతనం చెల్లిస్తారు. ఆసక్తి ఉన్న వారు బయోడేటాతో పాటు, ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు వెంట తీసుకెళ్లాలి. పూర్తి వివరాలకు 79898 88299లో సంప్రదించవచ్చు.

ఎంటెక్, ఎంఫార్మసీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు



జేఎన్‌టీయూఏ కళాశాల

అనంతపురం: జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాల, ఓటీపీఆర్ఐతో పాటు వైఎస్సార్ జిల్లా పులివెందులలోని జేఎన్‌టీయూఏ అనుబంధ కళాశాలలో ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈ నెల 16న స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఈ మేరకు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ ఆర్.కిరణ్మయి గురువారం వెల్లడించారు. ఏపీపీజీఈసెట్‌లో అర్హత సాధించి ఇప్పటి వరకూ ఎక్కడా అడ్మిషన్లు తీసుకోకుండా ఉండే విద్యార్థులు మాత్రమే అర్హులు. స్పాట్ అడ్మిషన్ల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ సెట్లను తీసుకుని ఈ నెల 16న జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో జరిగే స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు హాజరు కావచ్చు. పూర్తి వివరాలు జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్‌లో చూడవచ్చు.


సంక్షేమం లేని బడ్జెట్ ఎందుకు?

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



పెనుకొండ రూరల్: రాష్ట్ర ప్రజల సంక్షేమం, బీసీల పింఛన్లపై శాసన మండలిలో వైఎస్సార్‌సీపీ సభ్యురాలు వరుదు కళ్యాణి ప్రశ్నిస్తే బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత.. రాష్ట్రం అప్పుల్లో ఉందనడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉందన్న విషయం కూటమి ప్రభుత్వం ముందే గ్రహించలేదా? అని ఆమె ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 50 ఏళ్ల బీసీలకు పింఛన్లు ఇస్తామన్న విషయాన్ని ఎందుకు ఆశాఖ మంత్రి బడ్జెట్‌లో తీసుకురాలేదో చెప్పాలన్నారు. బీసీ శాఖ మంత్రి సవితకు బీసీలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉందనే విషయం అర్థమవుతోందన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను మోసం చేసే బడ్జెట్ అని విమర్శించారు. ప్రజల సంక్షేమ పథకాలకు దిశా నిర్దేశం లేని బడ్జెట్ అన్నారు. సంక్షేమ పథకాలకు చోటే లేని బడ్జెట్ వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగమూ లేదన్నారు. ఎన్నికల వాగ్దానాలకు.. కేటాయించిన బడ్జెట్‌కు ఏమైనా సంబంధం ఉందా అని కూటమి ప్రభుత్వాన్ని నేరుగా ప్రశ్నించారు. ఎన్నికల వేళ నీకు పదిహేను వేలు... నీకు పద్దెనిమిది వేలు అని డప్పు కొట్టి ప్రచారం చేశారని, అధికారం చేపట్టిన తర్వాత ఆ పథకాలకు ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా నిండా ముంచారన్నారు. మహిళలు ఎంతగానో ఎదురు చూస్తున్న ఉచిత బస్సు ప్రయాణాన్ని పండుగల పేరుతో కాలయాపన చేస్తున్నారే తప్పా అమలు మాత్రం చేయడం లేదని విమర్శించారు. నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాల ఊసే లేదన్నారు. ఇసుక, మద్యం, పేకాటలో కూటమి నాయకులు సిండికేటుగా మారి సంపాదనకు తెరలేపారే తప్పా, ప్రజల సంక్షేమానికి మాత్రం పాతరేశారన్నారు. ప్రశ్నించే సోషల్ మీడియా గొంతులు నొక్కి అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటన్నారు.

చిరుతలకు ప్రాణగండం



మడకశిర మండలం యు రంగాపురం సమీపంలో వాహనం ఢీకొని మృతి చెందిన చిరుత (ఫైల్)



రొళ్ల మండలం బాజయ్యపాళ్యం వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఎలుగు బంటి (ఫైల్)

- ఏడాదిన్నరలో నాలుగు మృతి
- రోడ్డు ప్రమాదాల బారిన పడి మరణం
- అడవుల విస్తీర్ణం గణనీయంగా తగ్గుతుండటమే కారణం
- వన్య ప్రాణులకు ఉమ్మడి జిల్లాలో అనుకూల వాతావరణం

ఉమ్మడి జిల్లాలో వన్యప్రాణుల వివరాలు..	
అనంతపురం జిల్లాలో అటవీ విస్తీర్ణం	7.29 శాతం
శ్రీ సత్యసాయి జిల్లాలో అటవీ విస్తీర్ణం	13.94 శాతం
ఉమ్మడి జిల్లాలో చిరుత పులుల సంఖ్య	400కు పైగా
కృష్ణ జింకలు	3,000 వరకు
చుక్కల దుప్పులు	450 వరకు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో చిరుతల మరణాల ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయి. పిల్లి జాతికి చెందిన చిరుతుల వృద్ధికి అత్యంత అనుకూలమైన వాతావరణం ఉమ్మడి జిల్లాలో ఉంది. రెండు జిల్లాల పరిధిలో వేలాది హెక్టార్లలో విస్తరించి ఉన్న చిట్టడవులు ఎన్నో జంతుజాలాలకు ఆవాసంగా ఉన్నాయి. అలాంటి చోట చిరుతలు అకాల మృత్యువుకు గురవుతుండటం విస్మయం కలిగిస్తోంది. అడవులు క్షీణించి వివిధ రాష్ట్రాల్లో పులులు అంతరించి పోతుండగా.. ఉమ్మడి జిల్లాలో మాత్రం రోడ్డు ప్రమాదాలు, వేటగాళ్ల ఉచ్చులో ఇరుక్కుని చిరుతలు మృతి చెందుతుండటం గమనార్హం.

ఏడాదిన్నరలో నాలుగు..

గడిచిన 18 నెలల కాలంలో ఉమ్మడి జిల్లాలో నాలుగు చిరుత పులులు మృతి చెందాయి. 2023 ఆగస్టులో రెండు చిరుతలు శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో అనుమానాస్పదంగా మృతి చెందాయి. ఇది జరిగిన కొన్నాళ్లకే జిల్లాలో శెట్టూరు మండలం లక్ష్మంపల్లి వద్ద మరో చిరుత మృతి చెందింది. ఇటీవల మడకశిర నియోజకవర్గంలో రోడ్డు దాటుతున్న సమయంలో వాహనం ఢీకొనడంతో చిరుత కన్నుమూసింది.

మిగిలిన వన్యప్రాణులూ..

చిరుతల తర్వాత ఎలుగుబంట్లు, జింకలు రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ప్రాణాలు వదులుతున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలోని పెనుకొండ సమీపంలో 2023లో రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొట్టి జింక మృతి చెందింది. అదే ఏడాదిలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలో ఎలుగుబంటి చనిపోయింది. దీనికితోడు వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుని జింకలు, దుప్పులు ప్రాణాలు కోల్పోతున్నాయి.

చిరుతల మృతికి ప్రధాన కారణాలు..

- రాత్రి పూట ఆహార వేటలో భాగంగా జాతీయ రహదారులపైకి రావడం, వాహనాల లైట్ల వెలుతురుకు దిక్కుతెలియక ప్రమాదానికి గురవడం
- రహదారుల పక్కన నీటిగుంట ఉండటంతో అక్కడికి వచ్చి రోడ్డు ప్రమాదంలో చిక్కుకోవడం
- చిరుతల గోర్ల కోసం వేటాడుతున్న వేటగాళ్ల ఉచ్చులో ఇరుక్కోవడం
- అడవుల విస్తీర్ణం ఏటికేటికీ కుంచించుకు పోతుండటం
- పంట పొలాలకు రైతులు ఏర్పాటు చేసే కరెంటు ఫెన్సింగ్‌లకు తగలడం

ఎమ్మెల్యే బాలయ్య ఇల్లు ముట్టడి



ఎమ్మెల్యే బాలకృష్ణ ఇంటి ఎదుట బైఠాయించిన ఆందోళనకారులు

హిందూపురం: ఇంటి పట్టాలు పంపిణీ చేయాలంటూ స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ ఇంటిని సీపీఎం ఆధ్వర్యంలో పేదలు ముట్టడించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి గురువారం ఉదయం ర్యాలీగా ఎమ్మెల్యే ఇంటికి వెళుతున్న ఆందోళనకారులను అడుగడుగునా అడ్డుకునేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. పెద్ద సంఖ్యలో మహిళలు, సీపీఎం కార్యకర్తలు, నాయకులు... ఎమ్మెల్యే బాలకృష్ణ ఇంటి వద్దకు చేరుకుని బైఠాయించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో ఇల్లు లేని నిరుపేదలు ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటే రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది రాత్రికి రాత్రి తొలగించి బీభత్సం సృష్టించారన్నారు. ఇదే అంశాన్ని శాంతియుతంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరేందుకు వెళుతుంటే అడ్డుకోవడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే జోక్యం చేసుకుని పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, సీఐటీయూ నాయకులు రాము, కిరణ్, జ్యోతమ్మ, నసీం తాజ్, సరస్వతి, సుమేరా, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా... ఉల్లాసంగా

- 'సాక్షి' ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం
- దివ్యాంగులను ప్రోత్సహించడం అభినందనీయం : వక్తలు



వారంతా దివ్యాంగ చిన్నారులు. లోకం పోకడ తెలియని పసిపాపలు. అయినా ఎందులోనూ తాము తక్కువ కాదని నిరూపించారు. ఉల్లాసంగా... ఉత్సాహంగా... చాలా సంతోషంగా వివిధ క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. గెలుపు కోసం తమ సర్వశక్తులూ ఒడ్డారు. చివరకు విజయం సాధించిన థ్రిల్‌తో ఉప్పొంగిపోయారు. 'సాక్షి' ఆధ్వర్యంలో గురువారం అనంతపురంలోని రామనగర్‌లో ఉన్న రాష్ట్రీయ సేవా సమితి (రాస్) మానసిక వికలాంగుల పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవం సందడిగా సాగింది.– అనంతపురం కల్చరల్:



బాలల దినోత్సవంలో పాల్గొన్న మానసిక దివ్యాంగులు, అనాథలు



బహుమతి అందుకుంటున్న చిన్నారి

విజేతలు వీరే...

జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన పరుగు పందెంలో నగేష్, లోకేశ్వర గౌడ్, భవ్యశ్రీ, మనస్విని, షాట్‌పుట్‌లో అజయ్‌గౌడ్, దుష్యంత్, చందన, స్లో వాక్‌లో దాదాపీర్, శబరీష్, రైమ్స్‌లో పవిత్ర, ప్రణవి, నాన్ వర్బల్ కమ్యూనికేషన్‌లో హరి యజ్ఞేష్, హరీష్, లాంగ్ జంప్‌లో అక్షయ్, అస్లాం, పిక్‌నిక్ బాస్కెట్ బాల్ పోటీల్లో మీషల్, శ్రీనివాస సాయిచరణ్ విజేతలుగా నిలిచారు. సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా లేడీస్ క్లబ్ జోనల్ ప్రతినిధి షమీమ్ షఫీవుల్లా, ఆత్మీయ అతిథులుగా అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రియాజుద్దీన్ అహమ్మద్, సాక్షి టీవీ జిల్లా ఇన్‌చార్జ్ శివారెడ్డి, జిల్లా ఎడిషన్ ఇన్‌చార్జ్ టి.మహేశ్వరరెడ్డి, రాస్ పాఠశాల హెచ్‌ఎం ఫర్హానా హాజరై, బహుమతులు ప్రదానం చేశారు. స్వీట్లు అందజేశారు.



స్లో వాక్ పోటీల్లో మానసిక దివ్యాంగులు



పరుగు పందెంలో పాల్గొన్న అనాథ చిన్నారులు



పిక్నిక్ బాస్కెట్‌బాల్ పోటీల్లో తలపడిన మానసిక దివ్యాంగ చిన్నారులు

దత్తత తీసుకుంటా...



నేను సాగిస్తున్న సేవా కార్యక్రమాలకు రాస్ సంస్థ వేదికగానే పునాదులు పడ్డాయి. మానసిక దివ్యాంగుల్లో ఉత్సాహం రేకెత్తిస్తూ 'సాక్షి' చేపట్టిన ఈ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా ఉంది. ఇలాంటి కార్యక్రమాలతో మానసిక దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెంపొందుతుంది. త్వరలో రాస్ సంస్థలోని అనాథ చిన్నారులను దత్తత తీసుకుని వారి బాగోగులు చూస్తా.
– తరిమెల రమణారెడ్డి, అమ్మ సంస్థ అధ్యక్షుడు

సాక్షి సంకల్పం అభినందనీయం



మానసిక వికలాంగులు, అనాథలను ప్రోత్సహించి వారిలో ఉత్సాహం నింపాలన్న ఆశయం స్ఫూర్తిదాయకంగా ఉంది. ఇలాంటి ప్రయత్నం చేపట్టిన సాక్షి మీడియా సంకల్పం అభినందనీయం. సేవా భావంతో పనిచేస్తున్న రాస్ సంస్థకు మా వంతు సాయమందిస్తాం.
– షమీమ్ షఫీవుల్లా, లేడీస్ క్లబ్ జోనల్ ప్రతినిధి

సాక్షి స్ఫూర్తిదాయక సేవలు



సమాజంలో అన్యాయానికి గురైన వారి పక్షాన నిలిచి, వారి వేదనను ప్రపంచానికి తెలియజేయడంలో 'సాక్షి' అన్నింటా ముందంజలో ఉంది. ప్రతి అంశంపై స్పందిస్తూ స్ఫూర్తిదాయక కార్యక్రమాలనూ చేపడుతోంది. ఇందులో భాగంగా మానసిక వికలాంగుల మధ్య బాలల దినోత్సవం జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలను చేపట్టేందుకు 'సాక్షి' సిద్ధంగా ఉంది.
– రామచంద్రారెడ్డి, సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్

క్లుప్తంగా

ఏపీ ఫుట్‌బాల్ జట్టులో జిల్లా క్రీడాకారులు



సంతోష్ ట్రోఫీకి ఎంపికైన జిల్లా క్రీడాకారులు

హిందూపురం టౌన్: ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకూ అనంత క్రీడాగ్రామం వేదికగా జరిగే సంతోష్‌ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీలో ప్రాతినిథ్యం వహించే ఏపీ జట్టులో జిల్లాకు చెందిన క్రీడాకారులకు చోటు దక్కింది. ఈ మేరకు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్ గురువారం తెలిపారు. డిఫెండర్‌గా శివప్రసాద్ (హిందూపురం), మిడ్ ఫిల్డర్‌గా మణికంఠ (హిందూపురం), స్ట్రైకర్‌గా ప్రవీణ్ కుమార్(కదిరి) ఎంపికైనట్లు వివరించారు. జట్టులో చోటు దక్కించుకున్న క్రీడాకారులను అనిల్‌కుమార్‌తో పాటు కార్యదర్శి మహమ్మద్ సలీమ్, కోశాధికారి శేఖర్, ఉపాధ్యక్షుడు ఇర్షాద్ అలీ అభినందించారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ఉమ్మడి జిల్లాలోని పలు పీఎస్‌ల్లో పని చేసి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు ఎస్.ఆంజనేయులు కుటుంబానికి రూ.4.32 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మొత్తాన్ని చెక్కురూపంలో మృతుడి భార్య జయలక్ష్మికి గురువారం ఎస్పీ రత్న అందజేశారు. ఉమ్మడి జిల్లాలోని హోంగార్డులు ఒక రోజు తమ గౌరవ వేతనాన్ని అందజేయడాన్ని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వలి, ఆర్‌ఎస్‌ఐలు ప్రదీప్‌సింగ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



గోపాలప్ప (ఫైల్)

పెనుకొండ రూరల్: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి తూము వద్ద కొడాలు అమరుస్తూ మృతి చెందాడు. మండలంలోని నాగలూరు గ్రామ సర్పంచ్ సునందమ్మ భర్త గోపాలప్ప(40) బుధవారం రాత్రి ఆ గ్రామ శివారులోని చెరువు వద్దకు చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో తూము వద్ద కొడాలు అమరుస్తుండగా ప్రమాదం చోటు చేసుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి అనంతలో సంతోష్ ట్రోఫీ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు

అనంతపురం అర్బన్: ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీ–2024ను విజయవంతం చేయాలని, ఇందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులను అనంతపురం జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంతోష్ ట్రోఫీ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఏపీఎఫ్‌ఏ) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు అనంత క్రీడాగ్రామం వేదికగా జరిగే టోర్నీకి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతపురంలో ఈ టోర్నీను నిర్వహించడం గర్వకారణమన్నారు. ఏపీఎఫ్‌ఏ ప్రధాన కార్యదర్శి డేనియల్ ప్రదీప్ మాట్లాడుతూ.. కొత్తతరం ఫుట్‌బాల్ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచేందుకు అధికారులు, మీడియా ప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు. మరింత సమాచారానికి, మీడియా విచారణకు 99855 06638లో సంప్రదించాలన్నారు. ఏపీఎఫ్‌ఏ ఉపాధ్యక్షుడు వేణుమాధవ్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సుధాకర్, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబాబు, అనంతపురం జిల్లా పీఆర్‌ఓ దీపక్ దయానంద్ పాల్గొన్నారు. కాగా, ఏపీ, కర్ణాటక, తమిళనాడు, అండమాన్ నికోబార్ జట్లు పాల్గొననున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఆంధ్ర, కర్ణాటక జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభం కానుంది. ఆల్ ఇండియా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కళ్యాణ్ చౌబే, ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ పాల్గొననున్నారు.

ఓపీఎస్ సాధనే లక్ష్యం

- ద.మ.రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యదర్శి శంకరరావు



ప్రసంగిస్తున్న శంకరరావు

గుంతకల్లు టౌన్: రైల్వే ఉద్యోగ, కార్మికుల పాలిట శాపంగా మారిన ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం సాధనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంతో సమరశీల పోరాటాలు సాగిస్తామని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యదర్శి శంకరరావు అన్నారు. డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో జరగనున్న రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం గుంతకల్లుకు విచ్చేసిన ఆయన రైల్వే డీజిల్ షెడ్, రైల్వే ఆస్పత్రి, రైల్వేస్టేషన్, డీఆర్‌ఎం కార్యాలయంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం డీజిల్ షెడ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. రైల్వేలో సింగిల్ యూనియన్‌గా మజ్దూర్ యూనియన్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకెళ్లి పాత పెన్షన్ విధానాన్ని సాధించి తీరుతామన్నారు. 8వ వేతన కమిటీ, ఎల్‌డీసీ పరీక్షలు, హార్డ్ అండ్ రిస్క్ అలవెన్సులను అన్ని విభాగాలకు వర్తించేలా కృషి చేస్తామని భరోసానిచ్చారు. రైల్వే ఉద్యోగ, కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాజీలేని పోరాటాలు సాగిస్తున్న యూనియన్ జెండా గుర్తుపై అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి విజయ్‌కుమార్, రైల్వే పెన్షనర్స్ యూనియన్ డివిజన్ కార్యదర్శి మస్తాన్ వలి, వివిధ బ్రాంచ్‌ల కార్యదర్శులు సుధాకర్, శ్రీనివాసులు, శివాజీ, వాహిద్, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.



- ఆకాశంలో అద్భుతం

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో కార్తీక చతుర్దశి నాడు అద్భుతం ఆవిష్కృతమైంది. కార్తీక పౌర్ణమికి ఒక్క రోజు ముందే వినీల ఆకాశంలో మేఘాలు దీపంలా మారగా... చంద్రుడు జ్యోతిలా దేదీప్యమానంగా వెలుగొందుతూ కనువిందు చేశాడు. సత్యసాయి నడియాడిన ప్రాంతంలో మంత్రముగ్ధులను చేసిన ఈ దృశ్యాన్ని దైవకృపగా భావిస్తూ పలువురు భక్తులు హారతులు పట్టారు. – పుట్టపర్తి రూరల్:

వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసు నమోదు

గోరంట్ల: మండలంలోని వానవోలు పంచాయతీ ఉపసర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బులెట్ బాబుతో పాటు ఉగ్రరాంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులుపై పోలీసులు అక్రమంగా కేసు బనాయించారు. వివరాలు... బూదిలివాండ్లపలికి చెందిన టీడీపీ కార్యకర్త రంగప్ప రెండు రోజుల క్రితం బులెట్ బాబు, శ్రీనివాసులు తన ఇంటిపైకి వచ్చి దాడి చేశారంటూ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ అంశంపై ఎలాంటి విచారణ చేపట్టకుండా వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. కాగా, రంగప్పపై గోరంట్ల, హిందూపురం పీఎస్‌లలో గతంలో పలు కేసులు నమోదయ్యాయి. రాజకీయంగా వైఎస్సార్‌సీపీ నేతలను దెబ్బ తీసేందుకు కుట్రపూరితంగా తప్పుడు ఫిర్యాదులతో అక్రమంగా కేసులు బనాయిస్తుండడంపై మండల వ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

17న పంపనూరులో కోటి దీపోత్సవం

ఆత్మకూరు: ఈ నెల 17న పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రంలో జరిగే కోటి దీపోత్సవ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణపై గురువారం పంపనూరు ఆలయంలో మండల స్థాయి అధికారులు, ఆలయ సిబ్బందితో ఆయన సమీక్షించారు. మరుగుదొడ్ల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తరాదన్నారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఎక్కడేగాని అపరిశుభ్రత ఉండరాదన్నారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు అసాంఘిక శక్తుల చర్యలను అడ్డుకునేలా అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసులకు సూచించారు. కోటి దీపోత్సవానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈఓ బాబు, డీఎల్‌పీఓ సుమన జయంతి, డీఎల్‌డీఓ లలితాబాయి, ఎంపీడీఓ లక్ష్మీనరసింహులు, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎస్‌ఐ లక్ష్మీనారాయణ, ప్రధాన అర్చకుడు రాము తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి

మడకశిరరూరల్: గ్రామాల్లో ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల నియంత్రణపై నిర్లక్ష్యం వీడాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని డీఎంహెచ్‌ఓ మంజువాణి ఆదేశించారు. గురువారం సాయంత్రం హరేసముద్రం ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. అనంతరం సీజనల్ వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఇంటింటా సర్వే ప్రారంభించి మాట్లాడారు. జ్వరపీడితులను గుర్తించి సత్వరమే చికిత్సలు అందజేయాలన్నారు. సర్వే నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, డాక్టర్లు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సొసైటీ ధ్యేయం



జెండాను ఆవిష్కరిస్తున్న డీసీఓ కృష్ణానాయక్, సిబ్బంది

పుట్టపర్తి టౌన్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సొసైటీ పని చేస్తోందని, రైతుల సహకారంతో పరపతి సంఘాలను మరింత బలోపేతం చేస్తామని డీసీఓ కృష్ణానాయక్ అన్నారు. పుట్టపర్తిలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సహకార పతాకాన్ని ఎగురవేసి గీతాలాపన, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణానాయక్ మాట్లాడారు. సహకార వ్యవస్థ దినదినాభివృద్ధి చెందుతూ అన్ని వర్గాల ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తోందన్నారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించి సంఘం బలోపేతానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాణరెడ్డి, డీసీసీబీ మేనేజర్ లక్ష్మణరెడ్డి, సూపర్‌వైజర్ అలీమ్‌బాషా, మేనేజర్ రాజేంద్రప్రసాద్, సీఈఓ రవిశంకరరెడ్డి, సిబ్బంది నరేష్, నరసింహులు, లోకేష్, రైతులు పాల్గొన్నారు.

వివాహిత దుర్మరణం



అలివేలమ్మ (ఫైల్)

రొళ్ల: ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ వివాహిత దుర్మరణం పాలైంది. వివరాలు... రొళ్ల మండలం బంద్రేపల్లి గ్రామానికి చెందిన రంగనాథ్, అలివేలమ్మ (38) దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతో పాటు కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. ఉపాధి పథకం కింద మెట్ట భూమిలో నాటిన మామిడి మొక్కలకు నీరు పెట్టేందుకు బుధవారం ఇంటి నుంచి బండి దోవలో కాలి నడకన వెళుతున్న ఆమెను వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఇన్‌చార్జ్ ఎస్‌ఐ బాలాజీ అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఆకట్టుకున్న ఆర్డీటీ ఆర్ట్ ఫెస్టివల్

అనంతపురం: ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర స్థాయి బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల్లో ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలు పెంపొందించేందుకు గత 42 సంవత్సరాలుగా ఆర్ట్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లుగా గుర్తు చేశారు. అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఆరు అంశాల్లో పోటీలు ఏర్పాటు చేశారు. చేతిరాత, రంగోళి, పిక్చర్ పెయింటింగ్, ఒరిగామి ఆర్ట్ వర్క్, న్యాచురల్ కొలేజ్, మట్టితో బొమ్మల తయారీ, అంశాల్లో జరిగిన పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 37 ప్రాంతాలకు చెందిన 222 మంది బాల, బాలికలు హాజరయ్యారు. విజేతలకు ఆర్డీటీ మహిళాసాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహనమురళీ తదితరులు బహుమతులు ప్రదానం చేశారు.



మట్టి బొమ్మల తయారీ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు



విజేతలతో ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్



రంగోళి పోటీలో పాల్గొన్న బాలికలు



పోటీలను పరిశీలిస్తున్న మాంఛో ఫెర్రర్

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

GNM (నర్సింగ్) అడ్మిషన్స్

■ On-Line Last Date: Nov-20th ఇంటర్ Any గ్రూప్ పాస్ స్టూడెంట్స్ కి GNM నందు గవర్నమెంట్ సీట్స్ కలవు. ఫ్రీ ఎడ్యుకేషన్ + ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర : జి.మురళి, 9030661651, అనంతపురము. [A-1405]

REAL ESTATE

బాడుగకు

■ అనంతపురం సిటీ నందు నేషనల్ పార్క్ శిల్పారామం వద్ద, N.H. హైవే దగ్గర, Skyadobe టవర్స్‌లో B-001, 2BHK ఫ్లాట్ బాడుగకు ఇవ్వబడును. సెల్: 9505555016 [A-364]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6600]

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1253915]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ ప్రతి రోజు 500 పేమెంట్. వాట్సాప్‌లో Hi అని మేసేజ్‌చేసి వివరాలకు కాల్ చేయండి. 8247808801. [M-1185422]

■ అనంతపురం నగరం నందు ప్రముఖ చికెన్ సెంటర్‌లో పనిచేయుటకు అనుభవంగల చికెన్ కటింగ్ మాస్టర్ అర్జెంటుగా కావలెను. డైలీ పేమెంట్ ఇవ్వబడును. సెల్: 8639254741. [A-1407]

■ అనంతపురంలోని శ్రీ మాస్టర్స్ జూనియర్ కళాశాల (భైరవనగర్) యందు పనిచేయుటకు మెస్ హెల్పర్ మరియు అటెండర్ (స్త్రీలు) వెంటనే కావలెను. సెల్ : 8919471814. [A-1404]

■ సోలార్ కంపెనీలో 2 సంవత్సరాల అనుభవం ఉన్న సేల్స్ ప్రొఫెషనల్స్ కోసం అవకాశాలు; శాలరీ : రూ. 10,000 నుండి రూ. 15,000. ఆసక్తి ఉన్నవారు సంప్ర : 8121766831. [A-1406]

■ అనంతపురము, కడప, కర్నూలు జిల్లాల్లో కిసాన్ మిత్ర ప్రోగ్రామ్ నందు ఫీల్డ్ వర్క్ చేయడానికి 10th, ఇంటర్, డిగ్రీ చదివిన స్త్రీ / పురుష అభ్యర్థులు కావలెను. ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్: జీతం: 16 వేలు. & డిస్ట్రిక్ట్ మేనేజర్: జీతం: 25 వేలు. 9885417885, 8341890291, 9000501816. [A-762476]

■ బజాజ్ ఎలక్ట్రానిక్ షోరూం అనంతపురం, గుత్తి, ధర్మవరంలో ఆఫీస్ బాయ్స్, ప్యాకింగ్ హెల్పర్, వెయిట్ లిఫ్టింగ్, ఫీల్డ్ మేనేజర్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: PF, ESI, 4 Wo కలదు. ✆ 9989139239, 8179196300. [T-1235151]

■ ప్రముఖ కంపెనీ నందు వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul: 10th- డిగ్రీ, Sal: 20k-25k ఉచిత రూము భోజనం సదుపాయం, వర్క్ ఫ్రం హోం అవకాశముంది. Cont: 8073902428 [G-9065]

■ ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ నందు పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ (పు), బైక్ ఉండవలెను. టెలికాలర్ (స్త్రీ) కంప్యూటర్ నాలెడ్జ్ కావలెను. కర్నూలు & నంద్యాల వాస్తవ్యులకు 6305919795 [Y-798490]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

అద్దెకు | అమ్మకాలు | కావలెను ఉద్యోగాలు | ఫర్నిచర్స్ | ఆటోమొబైల్ | కంప్యూటర్స్ | సర్వీసెస్ | రియల్ ఎస్టేట్

4 లైన్లు రూ. 270/-
అదనపు లైను రూ. 60/-
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

ANANTHAPURAMU : 9010567770, 9492288307, 9010588846
DHARMAVARAM : 9912220726, 9912220727
HINDUPUR : 9912220723, 9705346587
GUNTAKAL : 9010223701
TADIPATRI : 9912220722
MADAKASIRA : 9010200238
KADIRI : 9010593486
RAYADURG : 9010470185